

పోలమాంబ హుండీ ఆదాయం రూ.15.23 లక్షలు

ప్రజాశక్తి - మక్కువ

ఉత్తరాంధ్ర ఆరాధ్య దేవత శంబర పోలమాంబ అమ్మవారి జాతరకు భక్తుల నుంచి హుండీల ద్వారా రెండు వారాలకు సంబంధించిన ఆదాయాన్ని గురువారం లెక్కించారు. ఈ సందర్భంగా రూ.15 లక్షల 23 వేలు ఆదాయం వచ్చినట్లు దేవాదాయశాఖ ఇఒ వి.రాధాకృష్ణ తెలిపారు. దేవాదాయశాఖ అధికారి కెఎల్ సుధారాణి పర్యవేక్షణలో హుండీలు లెక్కింపు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. అలాగే 8 గ్రాముల మిక్స్ బంగారం, 60 గ్రాములు మిక్స్ వెండి లభించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ దాలినాయుడు, ఎస్ఐ పైడిరాజు ఎంపిటిసి సభ్యులు పోలి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమాల్లోనే ఏకలవ్య

- నత్త నడకన నూతన భవన నిర్మాణాలు
- భర్తీ కాని పోస్టులు
- ప్రభుత్వ ప్రకటనతో ఊరట



పాచిపెంట : పునాది దశలో ఉన్న ఏకలవ్య పాఠశాల భవనం

ప్రజాశక్తి - మక్కువ

ఏకలవ్య పాఠశాలలకు మహర్దశ పట్టనుంది. బుధవారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్లో భాగంగా ఏకలవ్య పాఠశాలల్లో 18 వేల టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో భామిని, పాచిపెంట, మక్కువ, గుమ్మలక్ష్మీపురం, కురుపాం (పార్వతీపురం) మండలాల్లో ఏకలవ్య పాఠశాలలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న ఈ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేస్తున్నట్లు ఆర్థికశాఖా మంత్రి నిర్మలాసీతారామన్ ప్రకటించడంతో విద్యార్థులకు మెరుగైన విద్య అందనుంది.

జిల్లాలో గుమ్మలక్ష్మీపురం మినహా మిగతా పాఠశాలలన్నీ సొంత భవనాలు లేక ఇతర పాఠశాలల్లోను, అద్దె భవనాల్లోనూ నడుస్తున్నాయి. మక్కువ మండలం లో ఏకలవ్య పాఠశాల ప్రస్తుతం ఎర్రసామంత వలస ఆశ్రమ పాఠశాలలో కొనసాగుతుంది. కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మిస్తున్న నూతన భవనాల పనులు నత్తనడకగా కొనసాగు తున్నాయి. సుమారు 7 ఉద్యోగాలు భర్తీ చేయాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా ప్రభు త్వం చర్యలు చేపట్టలేదు. ఇటీవలే టిజిటి ఇంగ్లీష్ టీచర్ ఉద్యోగానికి అవకాశం కల్పించినప్పటికీ సరైన అర్హత గల వారు లేక పోవడంతో ఆ పోస్ట్‌ను భర్తీ చేయలేదు. వార్డెన్ పోస్టు నియమించక పోవడంతో ఆ విధులు కూడా ప్రస్తుత ప్రిన్సిపల్ ఎర్రు నాయుడు చూస్తున్నారు. పాఠశాలకు అవసరమైన వైస్ ప్రిన్సిపల్, వార్డెన్, పిజిటి, పిడి, క్రాఫ్ట్, మ్యూజిక్ అధ్యాపకుల పోస్టులతో ఎఎన్ఎం పోస్టు కూడా భర్తీ కావాల్సి ఉంది. ఈ విద్యా సంవత్స రం ప్రారంభా నికైనా నూతన భవనాలు అందుబాటులోకి వస్తాయో? లేదోనన్న అనుమానం నెలకొంది.

పాచిపెంట : మండలంలోని గురువు నాయుడుపేట సమీపాన 15 ఎకరాల్లో రూ.12 కోట్లతో 2020లో ఏకలవ్య పాఠశాల పనులను ప్రారంభించారు. మూడేళ్ల పూర్తయినప్పటికీ భవనం పనులు పూర్తికాలేదు. ఇప్పటికీ శ్లాబ్ లెవెల్‌కు మాత్రమే పనులు జరిగాయి. సరాయివలస గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఈ పాఠశాల నడుస్తోంది.

గుమ్మలక్ష్మీపురం : గుమ్మలక్ష్మీపురంలో ఐదేళ్ల కిందట ఏకలవ్య పాఠశాల ఏర్పాటు చేశారు. నాటి నుంచి నేటి వరకు ఇక్కడ ఒక్క ప్రిన్సిపాల్ తప్ప ఉపాధ్యాయులు లేకపోవడంతో కొన్నాళ్ళ పాటు విద్యార్థులకు తరగతుల నిర్వహణ కష్టంగా మారింది. దీంతో విద్య అందని ద్రాక్షగా మారింది. దీనిపై గిరిజన సంఘాలు, విద్యార్థి సంఘాల ఆందోళన చేయడంతో ప్రభుత్వం స్పందించి తాత్కాలికంగా గత ఏడాది కాంట్రాక్టు ప్రాతిపదికన ఉపాధ్యాయులను నియమించి విద్యాబోధన అందిస్తోంది. ఆరో తరగతి నుంచి టెన్త్ వరకు ఒక్కొక్క సబ్జెక్టుకు ఇద్దరు ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. రూ.12 కోట్లతో నూతన భవనం నిర్మించి తరగతులు నిర్వహిస్తున్నారు. భామిని, పాచిపెంట, మక్కువలో ఏకలవ్య పాఠశాల భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయి. ఇది ఇలా ఉండగా బడ్జెట్ సమావేశాల్లో ఏకలవ్య పాఠశాలలో ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేస్తామని ప్రకటించడంతో నాణ్యమైన, మెరుగైన విద్యాబోధన అందించడానికి అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

సచివాలయాల్లో భూ రిజిస్ట్రేషన్లు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, పక్కన జెసి, ఐటిడిఎ పిఒ, డిఆర్ఒ

ప్రజాశక్తి -కలెక్టరేట్

సచివాలయాల్లో డాక్యుమెంటు రిజిస్ట్రేషన్లు ప్రారంభించేందుకు అవసరమైన ప్రక్రియ పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు సమీక్షించారు. కార్యక్రమం లో రీ-సర్వే, భూసేకరణ, మ్యుటేషన్స్, భూ వినియోగ మార్పిడి, జాతీయ రహదారుల ప్రాజెక్టులు, వ్యవసాయ రంగానికి సంబంధించి రబీ కాలానికి ఇ-క్రాప్ బుకింగు, బిందుసేద్యం, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం, జగనన్న పాలవెల్లువ, వై.ఎస్ఆర్ చేయూత, గృహ నిర్మాణం, చిరుధాన్యాల సాగు, వినియోగ ప్రోత్సాహం తదితర పథకాల అమలు, లక్ష్యాలను సమీక్షించారు. సచివాలయాల ద్వారా డాక్యుమెంటు రిజిస్ట్రేషను చేసేందుకు అవసరమైన ప్రక్రియ వెంటనే పూర్తిచేయా లని, అందుకు గానూ భూ రికార్డులను స్వచ్ఛీకరించాలని, భూ యజమానులకు అందిస్తున్న భూహక్కు పత్రాల్లో పేరు, సర్వేనంబర్ల వివరాలు తప్పుల్లేకుండా రికార్డులను ఈనెల 16 నాటికి సిద్ధం చేయాలన్నారు. భూ సేకరణ, జాతీయ రహదారుల నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. ఈనెల 20లోగా రబీ పంట ఇ-క్రాప్ బుకింగు పూర్తిచేసి విఎఎ, విఆర్ఒ ధ్రువీకరణ పూర్తి చేయాలన్నారు. చిరుదాన్యాల సాగును ప్రోత్సహించాలని, ఉద్యాన పంటల్లో అంతర పంటలుగా చిరుధాన్యాలను సాగుచేయించాలన్నారు. పట్టు పరిశ్రమ, మత్స్యశాఖల ద్వారా అమలు చేస్తున్న పథకాలను వేగవంతం చేయాలన్నారు. ఉగాది నాటికి లక్ష్యం మేరకు గృహాల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. వై.ఎస్.ఆర్. చేయూత, వై.ఎస్.ఆర్. పాల వెల్లువ, బల్క్ మిల్క్ కూలింగు సెంటర్ల నిర్మాణం లక్ష్యాలు పూర్తిచేయాలని తెలిపారు. కలెక్టరు నిశాంత్‌కుమార్ జిల్లా నివేదికలను తెలియజేస్తూ జిల్లాకు జాతీయ రహదారులతో రోడ్డు అనుసంధానం లేదని, పార్వతీపురాన్ని కలుపుకుంటూ జాతీయ రహదారి మంజూరు చేయాలని కోరారు.

అనంతరం జిల్లా కలెక్టరు అధికారులతో సమీక్షిస్తూ రబీ పంటకు ఇ-క్రాప్ నమోదు ఈనెల 20 నాటికి పూర్తిజేయాలన్నారు. గృహనిర్మాణాలకు సంబంధించి మండలాల వారీగా లక్ష్యాలు నిర్దేశించి పనులు వేగవంతం చేయాలని, అవసరమైన నిధుల కోసం నివేదికను తయారు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జెసి ఒ.ఆనంద్, ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్, డిఆర్ఒ జె.వెంకటరావు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ హెల్పర్లు

అంగన్వాడీ హెల్పర్ల నిరసన

ప్రజాశక్తి - కలెక్టరేట్

పార్వతీపురం ప్రాజెక్టులో అర్హులైన హెల్పర్లకు కార్యకర్తలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఇచ్చి ఉత్తర్వులు తిరిగి తీసుకోవడంపై అంగన్వాడీ హెల్పర్స్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టర్ ఆఫీస్ వద్ద నిరసన తెలిపారు. కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు వినతిని అందజేసి సమస్యలను విన్నవించారు. వీరి సమస్యలను విన్న కలెక్టర్ ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్‌తో మాట్లాడి వారం రోజుల్లో ఉత్తర్వులు జారీ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జ్యోతి, యూనియన్ నాయకులు ఇందిర, సిఐటియు నాయకులు కోశాధికారి జి.వెంకటరమణ, ఉపాధ్యక్షులు వి.ఇందిర, అంగన్‌వాడీలు ధర్మవతి, శాంతి, గౌరి, మణి, లక్ష్మి, పార్వతీ, పలువురు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 6న కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని గురువారం అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ పాలకొండ ప్రాజెక్ట్ కమిటీ ఆధ్వర్యంలో కరపత్రాన్ని ఆవిష్కరణ నిర్వహించారు. కనీస వేతనం ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యూటీ అమలు చేయాలని, జీతంలో సగం పెన్షన్ ఇవ్వాలని, పేస్‌యాప్ రద్దు చేయాలని, వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ మెనూఛార్జీలు పెంచాలని, జీవో 1ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి బి.అమరవేణి, స్థానిక నాయకులు జి జెస్సిబాయ్, జి. శారద, కె. శారద, ఎం. శ్యామల, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల 'కొంగు బంగారం'పేట

- ఐదు నెలలుగా అందని తాగునీరు
- మరమ్మతులకు నోచుకోని పైపులైన్
- ప్రయివేటు బోర్లపై ఆధారపడుతున్న జనం



ప్రయివేటు వ్యక్తి బోరు వద్ద నీళ్లు పట్టుకుంటున్న మహిళలు

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపాలిటీలోని 25వవార్డు పరిధిలో గల బంగారమ్మపేట అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. పేరులో బంగారం ఉన్నప్పటికీ సమస్యలు మాత్రం కొలువుదీరి వున్నాయి. గడచిన ఐదు నెలలుగా గ్రామ ప్రజలు తీవ్రమైన తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో ప్రజలు ముఖ్యంగా దళితులు ప్రయివేటు బోర్లపై ఆధారపడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. గ్రామంలో మూడు చేతి పంపులు ఉన్నా ఆ నీరు తాగడానికి పనికిరాదు. మున్సిపల్ పబ్లిక్ కుళాయిల ద్వారా సరిపడే నీటి సరఫరా కావడం లేదు. నెలల తరబడి ఇదే వెంటాడుతూనే ఉంది. ఈ గ్రామానికి వచ్చే తాగునీటి సరఫరా పైపులైన్ మరమ్మతులకు గురైంది. పట్టణానికి, బంగారమ్మపేటకు మధ్య ఉన్న పైపులైన్ లీకేజీ ఉన్న కారణంగా పూర్తి స్థాయిలో నీరు సరఫరా కావడం లేదు. ఈ లీకేజీలు ఎక్కడ ఉన్నాయో వాటర్ వర్క్స్ సిబ్బంది కనిపెట్టలేకపోతున్నారు. అక్కడక్కడ పైపులైన్ లీకేజీలు కనిపెట్టేందుకు ప్రయత్నిస్తున్నా ఫలితం కనిపించడం లేదు. దీంతో వార్డు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. ఈ సమస్యలపై కౌన్సిలర్ సింగారపు ఈశ్వరరావు గతంలో అనేకసార్లు మున్సిపల్ సమావేశాల్లో ప్రశ్నించారు. వార్డు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని ఏకరువు పెడుతున్నారు. అడిగినప్పుడల్లా అధికారులు రేపు, ఎల్లుండి అంటూ దాటవేత ధోరణి ప్రదర్శిస్తున్నారు. ఈ గ్రామంలో ప్రధానంగా ఎక్కువ మంది వ్యవసాయంపై ఆధారపడి బతికే రైతులు, కూలీలు ఉన్నారు. పశువులు, గొర్రెలు మేకల పెంపకంపై జీవిస్తున్నారు. సుమారు రెండు వేలమంది జనాభా ఉన్న గ్రామానికి సరిపడే స్థాయిలో తాగునీరు సరఫరా కాకపోవడం పెద్ద సమస్యగా మారింది. గ్రామంలో ఏర్పాటు చేసిన పైలెట్ వాటర్ స్కీం కూడా పనిచేయడం లేదు. ఇటీవల సంక్రాంతి పండుగ పూట కూడా ప్రజలు తీవ్రమైన తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆర్థికస్థోమత ఉన్న కుటుంబాలు సొంత బోర్లు వేయించుకున్నారు. పట్టణంలో తాగునీటి సరఫరాలో రానున్న వందేళ్ల పాటు ఇబ్బందులు రాకుండా వుండేలా ప్రాజెక్టుకు కొద్ది నెలల క్రితం డిప్యూటీ సిఎం రాజన్నదొర శంకుస్థాపన చేశారు. సుమారు రూ.73కోట్లతో ఈ ప్రాజెక్టు రూపకల్పన చేశారు. కానీ ఇంతవరకు దాని పనులు ప్రారంభం కాలేదు. పట్టణంలో చాలాచోట్ల పైపులైన్ లీకేజీ కారణంగా తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొత్త ప్రాజెక్టు నిర్మాణమైతే గానీ ఇలాంటి సమస్యలు పరిష్కారమయ్యే పరిస్థితి లేదు. ఇంతవరకైనా గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి కొరతను పరిష్కరించే దిశగా అడుగులు పడడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సమస్యను నీరుగారుస్తున్నారు

వార్డులో తీవ్రమైన తాగునీటి కొరత ఉంది. రాబోయే వేసవిలో ప్రజలు ఎక్కువగా ఇబ్బందులు ఎదుర్కొంటారు. పైపులైన్ లీకేజీ సమస్యను అధికారులు పరిష్కరించడం లేదు. ఐదారు నెలలు గా ఇదే సమస్యపై కౌన్సిల్ సమావేశాల్లో అడుగుతున్నాను. గ్రామంలో బడుగు వర్గాల కు చెందిన వారే ఎక్కువగా వున్నారు.



సింగారపు ఈశ్వరరావు,
కౌన్సిలర్, సాలూరు



అటవీశాఖాధికారులతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ఏనుగుల సమస్యకు పరిష్కారమెప్పుడు? : టిడిపి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

జిల్లాలోని పలు మండలాల్లో ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న ఏనుగుల సమస్యను తక్షణమే పరిష్కరించాలని టిడిపి అరకు పార్లమెంటరీ నియోజకవర్గం అధ్యక్షులు గుమ్మడి సంధ్యారాణి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా అటవీ శాఖ అధికారి కార్యాలయం ఎదుట కురుపాం, పాలకొండ, పార్వతీపురం, సాలూరు నియోజకవర్గం ఇన్చార్జులు, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్‌తో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన ఈ రోజుల్లోనూ ఇంకా ఏనుగుల సమస్యను పరిష్కరించకుండా చేస్తున్నారంటే దీనిపై అధికారులకు ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి వ్యక్తమవుతుందని అన్నారు. గతంలో ఇదే సమస్యను పరిష్కారం చేయడానికి అధికారులు చూపిన చొరవ అమోఘమని అదే అధికారులు ఇప్పుడు ఎందుకు చర్యలు చేపట్టడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికే ఏనుగుల దాడుల వల్ల పది మంది ప్రాణాలు కోల్పోగా లక్షల కొలది పంట నష్టం జరిగిందని నష్టపరిహారాలు చెల్లిస్తున్నప్పటికీ ఏ క్షణంలో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితుల్లో గ్రామీణల ప్రాణాలు చేతిలో పట్టుకొని ఉన్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం కదిలి భామిని, పార్వతీపురం ప్రాంతాల్లోని ఏనుగులను తరలించడానికి చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, ఆర్‌పి భంజ్‌దేవ్, పాలకొండ, కురుపాం నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు నిమ్మక జయకృష్ణ, తోయక జగదీశ్వరితో పాటు పార్లమెంటరీ స్థాయి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

గృహ లక్ష్యం పూర్తి చేయాల్సిందే

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్/టౌన్

ఉగాది నాటికి ఇచ్చిన గృహ నిర్మాణ లక్ష్యం పూర్తి చేయాల్సిందేనని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. లక్ష్యాలు సాధించని వారిపై చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. పార్వతీపురం పట్టణ, గ్రామీణ ఇంజినీరింగ్ సహాయకులతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గృహ నిర్మాణాలపైకలెక్టర్ గురు వారం సమీక్షించారు. ఉగాది నాటికి జిల్లాకు 15 వేల ఇళ్లు పూర్తి చేయాలని లక్ష్యం ఉందని, ఇప్పటికీ 7,500 పూర్తి అయ్యాయని చెప్పారు. లక్ష్యాలు పూర్తి చేయడం ఇంజినీరింగ్ సహాయకులు బాధ్యత అన్నారు. లబ్ధిదారులను ప్రేరేపించి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. 10రోజుల్లో లక్ష్యాలు సాధించాలని లేదా వేటు పడుతుందని అందుకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. స్వయం సహాయక సంఘాలకు రుణాలు మంజూరు చేశామని, నిర్మాణాల పూర్తికి ఎందుకు విఫలం చెందుతున్నారని ప్రశ్నించారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో పెద్ద ఎత్తున సిబ్బంది ఉన్నప్పటికీ లక్ష్యాలు సకాలంలో పూర్తి కాకపోవడం పనితీరుకు నిదర్శనంగా నిలుస్తుం దని ఆయన పేర్కొన్నారు. ప్రతి రోజు ప్రగతి కనిపించాలని ఆయన ఆదేశించారు. సమావేశం లో హౌసింగ్ పీడీ పి.రఘురాం, మునిసిపల్ కమీషనర్ నాయుడు, తహశీల్దార్ శివన్నారాయణ, ఎం.పి.డి.ఓ జావేద్, గహ నిర్మాణ సంస్థ డిఇ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక, ప్రజా వ్యతిరేక బడ్జెట్ : సిఐటియు

ప్రజాశక్తి - బలిజిపేట

కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా కార్మిక, ప్రజా వ్యతిరేకమైందని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దావాల రమణారావు, యమ్మల మన్మధరావు అన్నారు. 2013- 14 ఆర్థిక సంవత్సరానికి మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ కార్మికులకు, రైతులకు, శ్రమజీవులకు, ప్రజలకు పూర్తి వ్యతిరేకంగా ఉందన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కరించడానికి, పెరుగుతున్న ధరలు తగ్గించడానికి, దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి ఈ బడ్జెట్ ఉపయోగపడదని విమర్శించారు. కేవలం కార్పొరేట్లకు అనుకూల బడ్జెట్‌గా ఉందన్నారు. కావున కార్మికులు, ప్రజలు ఈ బడ్జెట్‌ను తిరస్కరించాలని కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి బడ్జెట్లో ఎటువంటి పరిష్కారం చూపలేదు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన ఐసిడిఎస్, మధ్యాహ్న భోజనం, జాతీయ ఆరోగ్య మిషన్, జాతీయ విద్యా మిషన్, జాతీయ జీవన ఉపాధి మిషన్లకు మోడీ బడ్జెట్ ఎటువంటి కేటాయింపులు చేయలేదన్నారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పట్టణాలకు విస్తరించాలని, 200 రోజులు పనులు ఇవ్వాలని, పెరుగుతున్న ధరలకు అనుకూలంగా రూ.600 రోజు వేతనం ఇవ్వాలని ప్రజానీకం డిమాండ్ చేస్తున్నా పట్టించుకోకపోగా, బడ్జెట్లో భారీ కోత విధించారని అన్నారు. పట్టణాల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు, యూజర్ ఛార్జీలు వసూలు చేయాలని మెలికిపెట్టిందని పేర్కొన్నారు. ఫైనాన్స్ రంగంలో మరిన్ని సంస్కరణలు పెట్టిందని, బ్యాంకింగ్ రెగ్యులేటర్ చట్టం, బ్యాంకింగ్ కంపెనీ చట్టం, ఆర్‌బిఐ చట్టాలకు సవరణలు చేస్తామని చెప్పిందని, ఇప్పటికే ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఇన్సూరెన్స్ కంపెనీలు ప్రైవేటీకరణకు మోడీ ప్రభుత్వం పూనుకుందని విమర్శించారు. ఈ బడ్జెట్ వల్ల కార్మికులకు, రైతులకు, ప్రజలకు ఎటువంటి ఉపయోగం లేదని, కావున ఈ బడ్జెట్‌ను వ్యతిరేకిస్తున్నట్టు వారు పేర్కొన్నారు.

'ఉపాధి'కి నిధుల కోత అన్యాయం

కొమరాడ : ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్‌లో భారీగా కోత పెట్టడం అన్యాయమని, దీనివల్ల భవిష్యత్తులో వ్యవసాయ కార్మికులు పనులు కోల్పోయి తీవ్రంగా ఇబ్బందులు పడుతారని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఏడాదికి 250 రోజులు పని దినాలు, రోజుకు రూ.600 వేతనం కల్పించాలని, పనులు జరిగే ప్రదేశంలో తాగునీరు, మజ్జిగ, టెంట్లు, మెడికల్ కిట్లు కల్పించాలని కోరారు. గతేడాది పెండింగ్ బిల్లులు చెల్లించాలని, పనిచేసిన కూలీలకు ప్రతి పది రోజులకొకసారి బిలుల్లఉ చెల్లించాలని డిమాండ్ చేశారు.



ఫీడర్ అంబులెన్స్ సిబ్బందితో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

ఫీడర్ అంబులెన్సుల సేవలు పెంచాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో ఫీడర్ అంబులెన్స్‌ల సేవల విస్తృతి పెంచాలని ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్ ఆదేశించారు. ఫీడర్ అంబులెన్స్‌ల సేవలపై సంబంధిత సిబ్బందితో ఐటిడిఎ గిరిమిత్ర సమావేశ మందిరంలో గురువారం ప్రాజెక్టు అధికారి సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ ఫీడర్ అంబులెన్స్‌లను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు మ్యాప్ చేయడం జరిగిందని, వాటికి అనుబంధంగా అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ఆరోగ్య సేవల కోసం ఫోన్ కాల్ వచ్చిన నిర్దేశిత సమయంలో బాధితుల సేవలకు సిద్ధంగా ఉండాలని ఆయన అన్నారు. తక్షణం సేవలు అందించి ఆదర్శంగా నిలవాలని ఆయన పేర్కొన్నారు. గిరిజనులకు మంచి సేవలు ఇవ్వాలని, ప్రాణాలతో చెలగాటం వద్దని చెప్పారు. అన్ని ఫీడర్ అంబులెన్స్‌లు పూర్తి స్థాయిలో పని చేయాలని, సిబ్బంది అందరూ అందుబాటులో ఉండాలని అన్నారు. వైద్య సేవల కొరత ఎట్టి పరిస్థితుల్లోనూ తలెత్తరాదని పిఒ అన్నారు. సమావేశంలో డెప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

వైస్ ఎంపిపి రేసులో సంపత్

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని ఒకటో వైస్ ఎంపిపిగా ఎంపికైన ముదిరి షణ్ముఖరావు ఇటీవల మృతి చెందడంతో ఖాళీ ఏర్పడింది. దీంతో పలువురు ఎంపిటిసి సభ్యులు ఒకటో వైస్ ఎంపిపి పదవికి పోటీ పడుతున్నారు. మండలంలో 13 మంది వైసిపి ఎంపిటిసి సభ్యులు గెలుపొందారు. వీరిలో ఎంపిపిగా బి.సురేష్‌కుమార్, రెండో వైస్ ఎంపిపిగా అలమండ ఎంపిటిసి సభ్యులు పార్టీని వీడి బయటకు వెళ్లిపోయారు. అయినా వీరిద్దరూ ఆయా పదవుల్లోనే కొనసాగుతూ వస్తున్నారు. ఒకటో వైస్ ఎంపిపి మరణంతో ఎంపిక అనివార్యమైంది. దీంతో ఒకటో వైస్ ఎంపిపికి నలుగురు ఎంపిటిసి సభ్యులు పోటీ పడుతున్నట్లు తెలుస్తుంది. అయినా మొదటి నుంచి వైసిపికి నాయకత్వం వహిస్తున్న యువకుడు, చదువుకున్న వాడు, మంచి వక్త అయిన పెదమేరంగి ఎంపిటిసి సభ్యులు గుడివాడ సంపత్ కుమార్ వైస్ ఎంపిపిగా ఎంపికైతే మండల అభివృద్ధికి ఎంతో తోడ్పాటుని ఇస్తుందని పలువురు భావిస్తున్నారు. 2011 నుంచి వైసిపిలో ఉన్నటువంటి సంపత్ కుమార్‌కు పదవిని కట్టబెట్టడానికి స్థానిక ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, వైసిపి జిల్లా అధ్యక్షులు పరీక్షిత్ రాజు సుముఖముగా ఉన్నట్లు తెలుస్తుంది. అయితే శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జరగబోయే ఒకటో వైస్ ఎంపిపి ఎన్నిక ఎటువైపు మలుపుతీస్తుందో వేచి చూడాల్సిందే.

భూసేకరణను అడ్డుకున్న రైతులు

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలో పేదలకు సంబంధించి ఇళ్ల స్థలాల కోసం భూసేకరణను గురువారం రైతులు అడ్డుకున్నారు. సుమారు 800మంది పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ కోసం రెవెన్యూ అధికారులు 11ఎకరాల భూమి సేకరణకు చర్యలు చేపట్టారు. బైపాస్ రోడ్డు పక్కన భూమి సేకరణ చేయడం, దాని విలువ మార్కెట్ ధర ప్రకారం కోట్లలో ఉండడంతో రైతులు అంగీకరించలేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూమికి ఇచ్చే ప్యాకేజీ చాలదని, మార్కెట్ ధర అధికంగా ఉందని రైతులు వాదిస్తున్నారు. దీంతో రైతులు రెవెన్యూ అధికారులు చేపట్టిన భూమిని చదును చేసే కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. డిపట్టా భూమి కావడంతో ప్రభుత్వ అధికారులు భూసేకరణకు దూకుడు ప్రదర్శిస్తున్నారు.



అధికారులతో వాగ్వివాదానికి దిగిన రైతులు



హాస్టల్‌ను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్

హాస్టళ్లలో సబ్‌కలెక్టర్ తనిఖీలు

పాలకొండ : పట్టణంలోని గారమ్మ కాలనీలో ఉన్న ఎస్సీ, బిసి బాలురు వసతి గృహాలను సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ గురువారం తనిఖీ చేశారు. వసతి గృహంలో మరుగుదొడ్లు, వంటగదులను పరిశీలించారు. వసతి గృహాల్లో తాగునీటి సమస్యను గుర్తించి రెండు హాస్టళ్లకు వెంటనే మున్సిపల్ కుళాయి కనెక్షన్లు ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే గారమ్మ కాలనీ చెరువు గట్టుపై ఆక్రమణలు వెంటనే తొలగించాలని సచివాలయ సిబ్బందికి, నగర పంచాయతీ కమీషనర్ ను ఆదేశించారు.

పోలీసు స్టేషన్‌ను సందర్శించిన డిఎస్‌పి

పాచిపెంట : స్థానిక పోలీస్ స్టేషన్ పార్వతీపురం డిఎస్‌పి ఎ.సుభాష్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు కేసులకు సంబంధించిన దస్త్రాలను పరిశీలించారు. అలాగే స్టేషన్ పోలీస్ సిబ్బందికి డ్యూటీ పరంగా పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం పి.కోనవలస చెక్‌పోస్ట్‌ను సందర్శించి నాటు సారా, గంజాయి, ఖైనీ, గుట్కా వంటి అక్రమ రవాణాలపై ఉక్కుపాదం మోపాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. ఆయన వెంట స్థానిక ఎస్సై ఎం.వెంకటరమణ ఉన్నారు.

ఉన్నత పాఠశాలను పరిశీలించిన డిఎంహెచ్‌ఒ

పార్వతీపురం రూరల్ : మండలంలోని తాళ్లబురిడి జెడ్పీ ఉన్నత పాఠశాలను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి బి.జగన్నాథరావు గురువారం తనిఖీ చేశారు. పాఠశాల ప్రాంగణంలో పరిశుభ్రత, వంట గది, మధ్యాహ్న భోజనం, విద్యార్థుల విద్యా ప్రమాణాలు పరిశీలించారు. విద్యార్థుల పట్ల శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పౌష్టికాహారం అందాలని, రానున్న పరీక్షా కాలం దృష్ట్యా విద్యార్థులకు చక్కటి తర్ఫీదు ఇవ్వాలని, ఒత్తిడి లేకుండా తీర్చిదిద్దాలని ఆయన పేర్కొన్నారు.

వసతి గృహాల పనితీరుపై తహశీల్దార్ అసంతృప్తి

కురుపాం : స్థానిక జ్యోతి బాపూజీ గురుకుల పాఠశాల, ఎస్‌సి, బిసి వసతి గృహాలను తహశీల్దార్ ఆర్.రమేష్‌కుమార్ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్లో విద్యార్థులకు వండిన వంటలు, మరుగుదొడ్లు, హాస్టళ్ల పరిసరాలను పరిశీలించి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టళ్లన్నీ అపరిశుభ్రంగా ఉన్నాయని విద్యార్థులు వాడుతున్న మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్నాయని, పరిసరాలు చెత్తాచెదారులతో నిండి ఉన్నాయని వసతి గృహ సంరక్షణ అధికారికి తక్షణమే మరుగుదొడ్లు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.

పూర్వపు కమిషనర్‌పై విచారణ

పాలకొండ : స్థానిక నగర పంచాయతీ కార్యాలయాన్ని మున్సిపల్ శాఖ రీజనల్ డైరెక్టర్ నాగరాజు గురువారం సందర్శించారు. గతంలో కమిషనర్‌గా పనిచేసిన బి.శివప్రసాదరావుపై గురువారం ఆయన విచారణ చేపట్టారు. అప్పట్లో కుళాయి కనెక్షన్లు అనధికారికంగా వేయడంతో పాటు, ఒక ఇంటి ప్లాన్ విషయంలో ఎటువంటి పత్రాలు లేకుండా ఆమోదించారని, నగరపంచాయితీ షాప్‌ల లీజ్ వ్యవహారంలో కూడా నిబంధనలు ఉల్లంఘించారని అప్పటి కమిషనర్ శివప్రసాద్‌పై ఫిర్యాదు వెళ్లడంతో దానిపై విచారణ చేపట్టారు. సమగ్రంగా దర్యాప్తు చేపట్టారు. ఈ నివేదికలను ఉన్నతాధికారులకు అందిస్తానని తెలిపారు. ఈయనతో పాటు కమిషనర్ సర్వేశ్వరరావు ఉన్నారు.

కూలి గిట్టుబాటు కాకపోతే ఎలా?

సీతానగరం : కూలి కిట్టుబాటే ఎలా ప్రభుత్వం నిబంధన ప్రకారం పని చేయాలని ఎపిఒ జి.నాగలక్ష్మి ఉపాధి కూలీలు ప్రశ్నించారు. మండలంలోని లచ్చయ్యపేట, చిన్నబోగిలి, బల్ల కృష్ణారాయపురం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు పూటలా పనిచేయాలన్నారు. ఎన్‌ఎంఎంఎస్ హాజరు తప్పక ఉండాలని, పని ప్రదేశాలలో టెంట్లు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. జాబు కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ కూలి గిట్టుబాటు కావడంలేదన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

జాబ్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికీ పని కల్పించాలి

బలిజిపేట : జాబ్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఉపాధి పని ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి.సత్యంనాయుడు డిమాండ్ చేశారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో వ్యవసాయ పనులు ముగిసిపోయాయని, దీంతో అనేక మంది ఉపాధి కోసం వలసలు పోతున్నారన్నారు. ఉపాధి పనులు కొన్ని గ్రూపులకు మాత్రమే పెట్టి మిగతా గ్రూపులకు కల్పించడంలేదని అన్నారు. కావున జాబు కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని, 200 రోజులు పనులు ఇవ్వాలని, పెరుగుతున్న నిత్యావసర వస్తువు ధరలతో పాటు గ్యాస్, డీజిల్, పెట్రోల్, బస్ ఛార్జీలు విపరీతంగా పెరిగాయని, పెరుగుతున్న ధరలకు అనుకూలంగా కూలి రోజుకు రూ.600 ఇవ్వానలి డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు పీస వెంకటస్వామి, మండల కమిటీ సభ్యులు నల్ల ఈశ్వరరావు, వెన్నెల కృష్ణమూర్తి పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు చర్యలు

కొమరాడ : విద్యార్థుల్లో రక్త హీనత నివారణ దిశగా వైద్య, పాఠశాల సిబ్బంది సమిష్టిగా కృషి చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం మండలంలో విక్రంపురం, గుణానుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు ఆరోగ్య అవగాహన కల్పించారు. అలాగే వైద్య సిబ్బంది విద్యార్థులకు నిర్వహించిన హెమోగ్లోబిన్ రక్తపరీక్షలను పరిశీలించారు. హెమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉన్న విద్యార్థులు క్రమం తప్పకుండా ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు వేస్తున్నదీ, సమతుల్య ఆహారం తీసుకుంటున్నదీ వైద్య, స్కూల్ సిబ్బంది పర్యవేక్షించాలని సూచనలు చేశారు. ముఖ్యంగా కిశోర దశ బాలికల్లో రక్తహీనతకు గురికాకుండా తగు చర్యలు చేపట్టాలని సూచిస్తూ వారి ఆరోగ్య పరీక్షల వివరాలను స్కూల్ హెల్త్ యాప్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు రక్తహీనత, వాటి లక్షణాలు, నివారణా చర్యలు, పరిశుభ్రత, రోగనిరోధక శక్తి తదితర అంశాలపై డాక్టర్ జగన్మోహన్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వి.వెంకటనాయుడు, ఆర్.ఊర్మిళ, వైద్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

వంశధార తీరంలో ఏనుగుల గుంపు

భామిని : మండలంలోని పసుకుడికి ఆనుకొని ఉన్న వంశధార నదీతీరంలో ఏనుగులు నీరు తాగి సేద తీరుతున్నాయి. నదీతీరంలో ఉన్న చెరకు, మొక్కజొన్న పంటలను ధ్వంసం చేస్తున్నాయి. నదీతీరం వైపు పొలాలకు వెళ్లే రైతులు, ప్రజలు ఎంటువంటి కవ్వింపు చర్యలకు పాల్పడొద్దని ఎలిఫెంట్ ట్రాకర్స్ సూచిస్తున్నారు.

ఏనుగు బాధిత రైతులను ఆదుకోవాలి


భామిని : ఏనుగుల గుంపు ధ్వంసం చేస్తున్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలని టిడిపి నాయకులు పడాల భూదేవి డిమాండ్ చేశారు. గురువారం ఏనుగుల ప్రభావిత గ్రామాలను సందర్శించారు. పసుకుడిలో మాజీ ఎంపిటిసి సభ్యులు వై.శ్రీనివాస్‌కు చెందిన అరటితోట, దామోదర బారికి చెందిన చెరకు, గొర్లి కృష్ణారావుకు చెందిన టమాట, కానుపల్లి ఉదయేను చెందిన మొక్కజొన్న తదితర రైతుల పంటలను ధ్వంసం చేసిన విషయం తెలుసుకున్న ఆమె పంట పొలాలను పరిశీలించారు. అనంతరం భూదేవి మాట్లాడుతూ మూడున్నరేళ్లుగా రైతులు నష్టాలు పడుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. వెంటనే నష్టపరిహారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ బి.రవినాయుడు, మాజీ ఎంపిటిసి సభ్యులు వై.శ్రీనివాసరావు, రామారావు, ప్రభృతులు తదితరులు పాల్గొన్నారు.



ఏనుగులు ధ్వంసం చేసిన పంటను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు భూదేవి

క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి చర్యలు

గృహ సారథులు, సచివాలయ కన్వీనర్ల సమావేశంలో డిప్యూటీ సిఎం



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

గ్రామ సంస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని గుర్తించి పరిష్కారానికి వైసిపి ప్రభుత్వం గృహ సారథులు, సచివాలయ కన్వీనర్ల నియామకం చేపట్టినట్లు డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర చెప్పారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ అధ్యక్షతన జరిగిన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో వార్డు వాలంటీర్లతో పాటు గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు సమన్వయం చేసుకుని పనిచేయాలన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. అభివృద్ధి పనులకు కూడా తగిన ప్రాధాన్యత ఇస్తూ ముందడుగు వేసిందని చెప్పారు. ప్రభుత్వం ఎంత ఖర్చు అయినప్పటికీ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు విస్మరించలేదని చెప్పారు. రానున్న రోజుల్లో వాలంటీర్లు, సచివాలయాల మధ్య వారధిగా కన్వీనర్లు, గృహ సారథులు పనిచేయాల్సి ఉంటుందని రాజన్నదొర చెప్పారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు జర్జాపు ఈశ్వరరావు, వైస్ చైర్మన్లు వంగపండు అప్పలనాయుడు, జర్జాపు దీప్తి, కౌన్సిలర్లు గిరి రఘు, గొర్లి వెంకటరమణ పప్పల లక్ష్మణరావు, కమిషనర్ హెచ్ శంకరరావు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : గృహ సారథులు, కన్వీనర్లు వాలంటీర్ల సారథ్యంలో పనిచేయాలని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆధ్వర్యాన మొదటి విడతగా జగన్నాథపురం, కొత్తవలస, పట్టణ ప్రాంతాల్లోని 8 వార్డుల సచివాలయాల కన్వీనర్లు, వాలంటీర్లు, గృహ సారథులతో కలిసి 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం నిర్వహించి వారికి భవిష్యత్ కార్యాచరణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కొత్తగా నియమించిన వార్డు సచివాలయం కన్వీనర్లు, వాలంటీర్లు, గృహ సారథులతో కలిసి ప్రభుత్వం ముఖ్యోద్దేశాన్ని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈనెల 11న నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా ప్రారంభము కానున్న "మా నమ్మకం నువ్వే జగన్" అనే కార్యక్రమం ద్వారా గృహ సారథులు అంతా సచివాలయం కన్వీనర్లు, వాలంటీర్ల సహాయంతో తమ పరిధిలో గల ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వారికి వివరించి గత ప్రభుత్వం మోసపర్చిన విధానం, ప్రస్తుత మన ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి గురించి వారికి వివరించి వారి అనుమతితో డోర్ స్టికర్, మొబైల్ స్టికర్ అంటించే బాధ్యత మీరంతా తీసుకుని పార్టీని ప్రజల్లోకి మరింత చేరువ చేసేలా చూడాల్సిన బాధ్యత మీతో పాటు మన అందరిపై ఉందని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నియోజకవర్గ పరిశీలకులు శోభా హైమావతి మాట్లాడుతూ ఎమ్మెల్యే నాయకత్వంలో పార్టీ నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు గృహసారథులు, కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలంతా కలిసి సమిష్టిగా కృషి చేయాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్‌పర్సన్లు కొండపల్లి రుక్మిణి, ఇందుపూరు గున్నేశ్వరరావు, పార్టీ పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, పట్టణ జెసిఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, వివిధ వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సచివాలయం కన్వీనర్లు, వాలంటీర్లు, గృహ సారథులు, వైసిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సీతానగరం : సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు పరీక్షిత్‌రాజు

సీతానగరం : ఎన్నికల్లో ఇచ్చిన హామీలు 98శాతం అమలు చేసింది జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వమని ఎమ్మెల్యే ఎ.జోగారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం గృహ సారథుల అవగాహన సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి తద్వారా సంక్షేమ పథకాలు ప్రజల వద్దకు తీసుకెళ్లే పని చేస్తున్నామన్నారు. ప్రతి పేదవానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి ఇచ్చిన సంక్షేమ పథకాల గురించి వివరించి వైసిపిని రానున్న ఎన్నికల్లో గెలిపించేలా గృహసారథులు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి శోభ హైమావతి, ఉమ్మడి జిల్లాల వ్యవసాయ సలహామండలి జిల్లా అధ్యక్షులు వాకాడ నాగేశ్వరరావు, ఎంపిపి బి.రమణమ్మ, జెడ్‌పిటిసి సభ్యులు ఎం.బాబ్జీ, మండల నాయకులు బి.చిట్టిరాజు, బి.శ్రీరాములునాయుడు, కె.రత్నాకర్, ఎన్.రామకష్ణ, ఆర్‌వి పార్ధసారధి, బి.తిరుపతిరావుతో పాటు గ్రామాలకు చెందిన నాయకులు, వాలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లు పాల్గొన్నారు.

పుట్టూరులో కుష్టు నివారణ ర్యాలీ

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మండలంలోని బందలుప్పిలో గురువారం స్థానిక పిహెచ్‌సి వైద్యబృందం, సిబ్బంది కుష్టువ్యాధి నివారణ పక్షోత్సవాల్లో భాగంగా గ్రామస్తులకు అవగాహన కల్పిస్తూ, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ముందుగా గ్రామంలో ఇంటింటికి వెళ్లి కుష్టువ్యాధిగ్రస్తుల గుర్తింపు నిర్వహించారు. అనంతరం లెప్రసీ డిపిఎంలు బెంజిమిన్, బలరాంనాయుడు మాట్లాడుతూ జనవరి 30 నుండి ఫిబ్రవరి13 వరకు కుష్టువ్యాధిపై ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు నివారణ వారోత్సవాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బందలుప్పి వైద్యాదికారి డాక్టర్ పి.శ్రీకాంత్, సిబ్బంది శంకరరావు, నోడల్‌పర్సన్ నాగలక్ష్మి, ఆశాలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

నరిసిపురంలో వైద్యపరీక్షలు

మండలంలోని నర్సిపురంలో బందలుప్పి పిహెచ్‌సి వైద్యాధికారి ఎన్.తిరుమలప్రసాద్ స్థానిక అంగన్‌వాడీ కేంద్రాలు సందర్శించి, చిన్నారులకు ఆరోగ్యపరీక్షలు నిర్వహించారు. పిల్లల ఎత్తు, బరువులు, రక్తపరీక్షలు నిర్వహించారు. కార్యకర్తలకు తగుసూచనలు ఇచ్చారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కూడా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిహెచ్‌ఒలు, ఎఎన్ఎం, సిహెచ్‌డబ్ల్యూఒలు ఆశావర్కర్లు పాల్గొన్నారు.

తలవరంలో ఫ్యామిలీ డాక్టర్

వీరఘట్టం: మండలంలోని తలవరంలో గురువారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరఘట్టం, బిటివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు ఎస్.తనుజ, ఎన్.మానస గర్భిణీలకు, బాలింతలకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం లక్ష్మి, టెక్నీషియన్ దినేష్, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది ,తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ రోజువారీ ఆశీల వేలం ఖరారు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఈఏడాది ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు మున్సిపల్ కూరగాయల మార్కెట్, ప్రధాన రహదారితో పాటు 30 వార్డుల పరిధిలో పుట్‌పాత్‌కు ఇరువైపులా తోపుడుబండ్లు, చిరు వ్యాపారుల నుంచి రోజువారి ఆశీలు వసూలు చేసే వేలంపాటను గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఖరారు చేశారు. మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడు ఆధ్వర్యాన మున్సిపల్ రెవెన్యూ అధికారి దిబ్బా రూబేన్ సమక్షంలో వేలం పాట నిర్వహించారు. వేరొక పాటదారులు పాల్గొన్నప్పటికీ సాల్విన్స్ సర్టిఫికెట్ తీసుకురాకపోవడంతో ముర్వల వాసుదేవరావు మున్సిపల్ స్లీపింగ్ ఛార్జీలతో కలిసి రూ.26 లక్షల 24 వేలకు ఆశీలు వేలం పాటను దక్కించుకున్నారు. ఈ వేలం పాటతో పాటు గొర్రెలు, మేకలు, పశువుల కమేళా వ్యాపారులు నుంచి ఆశీలు వసూలు చేసుకునే హక్కును గుంట చినపోలయ్య దక్కించుకున్నారు. అయితే గత ఏడాది రూ.20 లక్షల 670 వేలం పాట ఖరారు కాగా, ఈ ఏడాది రూ.6 లక్షల 23 వేలు అదనంగా రావడంతో మున్సిపల్ అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. కౌన్సిల్ తీర్మానం అనంతరం ఏప్రిల్ 1 నుంచి ఆసీలు వసూలు చేసుకొనే హక్కు కలిగి ఉంటాడని మున్సిపల్ రెవెన్యూ అధికారి తెలిపారు. గత ఏడాది 4 సార్లు ఆశీలు వేలం పాట వాయిదాలు పడగా, ఈ ఏడాది ఒక్క రోజులోనే పాట ఖరారు కావడం విశేషం. కార్యక్రమంలో ఆర్‌ఐలు పి.నారాయణరావు, జి.వినయ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ పుష్పలత, పాటదారులు పాల్గొన్నారు.



వేలంపాటదారులతో మాట్లాడుతున్న కమిషనర్ రామప్పలనాయుడు

మంచినీటి బోర్లను సక్రమంగా వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని గిరిజన ప్రాంతంలో జలజీవన్ మిషన్ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను కురుపాం ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ కె.నాగేశ్వరరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మండలంలో కుక్కిడి, సికలపాయి, పెద్దగూడ, పెద్ద గూడ కాలనీ, పాత నిగరం, పాత నిగరం కాలనీ, తంబంగూడ, చెముడుగూడ తదితర గ్రామాలను పరిశీలించి అక్కడ ప్రజలకు, ఇంజనీరింగ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. రక్షిత మంచినీటి పథకాన్ని సక్రమంగా వినియోగించుకొవాలని, నీటి వనరుల కొరత లేకుండా చూసుకోవాలని కోరారు. ఆయన వెంట ఆర్డబ్ల్యూఎస్ ఎఇ ప్రవీణ్ కుమార్, కుక్కిడి సర్పంచ్ సింహాచలం, పంచాయతీ కార్యదర్శి తదితరులు ఉన్నారు.



కుళాయిలను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ నాగేశ్వరరావు

గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన గ్రామాలకు నాణ్యమైన రహదారి సౌకర్యాలను కల్పించాలని సిపిఎం నాయకులు కొల్లి గంగునాయుడు, అడ్డమేశ్వరరావు, కె.సీతారాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలో వబ్బంగి పంచాయతీలో పలు గిరిజన గ్రామాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం ద్వారా యంత్రాలతో తోలుంగూరిడా, కొసంగూడ, లిక్కడికి మట్టి రహదారిని వేసినప్పటికీ ఈ రోడ్డు కనీసం మనుషులు కూడా నడవడానికి అనుకూలంగా లేదని అన్నారు. రాళ్లు, రప్పలతో తేలిపోయాయని, ద్విచక్ర వాహనంపై కనీసం వెళ్లలేరని అన్నారు. గిరిజనులు అనారోగ్యం బారినపడితే అత్యవసర సమయంలో కనీసం 108 వాహనమైన గ్రామానికి వెళ్లేలా రహదారి ఉంటే బాగుంటుందని అన్నారు. అలాగే రానున్న వేసవి నేపథ్యంలో ప్రతి గ్రామానికి తాగునీటి సౌకర్యం కల్పించాలని, గెడ్డ నీరు తాగడం వల్ల అనేక రకాల జబ్బులకు గురవుతారని, కావున తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని, లేదంటే భవిష్యత్తులో గిరిజనులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



ట్రాక్టర్‌పై జారిపోయిన నీలగిరి కర్రలు

ట్రాక్టర్ నుంచి జారిపడిన నీలగిరి కర్రలు

పార్వతీపురం టౌన్ : పట్టణంలో గురువారం బైపాస్ రోడ్డు జంక్షన్‌లో దుర్గ గుడి దగ్గరలో రహదారిపై ఉన్న స్పీడ్ బ్రేకర్స్ వద్ద నీలగిరి కర్రలతో వెళ్తున్న ట్రాక్టర్ నుంచి కర్రలు రహదారిపై అకస్మాత్తుగా జారి పడడంతో కొంత అంతరాయం కలిగింది. అయితే ఆ సమయంలో ఎటువంటి వాహనాలు, వాహన చోదకులు, పాదచారులు లేకపోవడంతో ఇటువంటి ప్రమాదము సంభవించలేదు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

అలా పనిచేస్తే కూలీలకే నష్టం

ప్రజాశక్తి - వీరఘట్టం

కొలతలు లేకుండా పనులు చేపట్టడం వల్ల వేతనదారులు నష్టపోతున్నారని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ కె.రామచంద్రరావు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మండలం విక్రంపురం గ్రామ సమీపంలో జరుగుతున్న ఉపాధి పనులు పరిశీలించిన సందర్భంగా మాట్లాడారు. ఉపాధి కల్పించిన చోట తప్పనిసరిగా కొలతలు వేసి వేతనదారులకు అప్పజెప్పాలన్నారు. కొలతలు లేకుండా పనిచేస్తే వేతనదారుడికి కనీస వేతనం రాకపోవడంతో పాటు శ్రమకు తగ్గ ఫలితం ఉండదని స్పష్టం చేశారు. అనంతరం వీరఘట్టం ఉపాధి కార్యాలయానికి చేరుకుని పరిశీలించగా అందుబాటులో అధికారులు లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయానికి విధులకు హాజరు కాకపోతే వేతనదాలకు మీరే న్యాయం చేస్తారని ఎపిఒ జి.సత్యంనాయుడును ప్రశ్నించారు. మరోసారి ఇలా జరిగితే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అనారోగ్యంతో ఆరోగ్య మిత్ర మృతి

భామిని : మండలంలోని ఎతంగూడకు చెందిన బిడ్డికి వెంకటరమణ స్థానిక ప్రభుత్వం వైద్య కేంద్రంలో ఆరోగ్య మిత్రగా సేవలు అందిస్తున్నాడు. గత కొన్ని నెలలుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వెంకటరమణ గురువారం ఉదయం మృతి చెందాడు. ఆయనకు భార్య లక్ష్మి, ముగ్గురు కుమార్తెలు వున్నారు. వెంకట రమణ మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

నగర పంచాయతీలో 'ఇదేం కర్మ'

పాలకొండ రూరల్: స్థానిక నగర పంచాయతీ 9, 10 వార్డుల్లోఇదేం కర్మ రాష్ట్రాన్ని కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ వైసిపి పాలనలో నిత్యవసరకులు ధరలతో పాటు పెట్రోలు, డీజిల్, గ్యాస్ వంటి అన్ని రకాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. ప్రతి ఒక్కరూ. టిడిపిని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, పాలకొండ పట్టణ అధ్యక్షులు గంటా సంతోష్ కుమార్, సుంకరి అనిల్ దత్, అడపా బాబ్జి, వెన్నపు.శ్రీనివాసరావు, అంపోలు శ్రీనివాసరావు, ఆనెపు జవరాజు, పడాల రాంబాబు, లోకనాదం చౌదరి,ఉదయాన చంద్రినాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

12 మంది అరెస్టు

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని సుభద్ర గ్రామ పరిధిలో కోళ్ల పందాలు ఆడుతున్న 12మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై ఎన్ ప్రశాంత్ కుమార్ తెలిపారు. ముందస్తున్న సమాచారం మేరకు, వారి సిబ్బందితో కలిసి సుభద్ర గ్రామ శివారులో ఆకస్మికంగా దాడి చేసి, 12 మందిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.21,480/- నగదు, రెండు కోడి పుంజులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ దాడిలో కానిస్టేబుళ్ల రామకృష్ణ, శ్రీను, రాజు, ప్రసాద్, సతీష్, తిరుపతి ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

160 లీటర్ల సారా పట్టివేత

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని వలగజ్జి సెంటర్ వద్ద 160 లీటర్ల నాటు సారాను ఆటోలో బైక్‌పై క్యాన్లతో తరలిస్తుండగా సీతంపేట ఎస్సై ఎ.నీలకంఠరావు తన సిబ్బందితో మాటువేసి పట్టుకున్నారు. ఈ నాటుసారా పాలకొండ తరలిస్తుండగా పట్టుకున్నారు. పాలకొండకు చెందిన కనపాక శ్రీను, ప్రవీణ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై నీలకంఠరావు మాట్లాడుతూ నాటు సారా రవాణా చేస్తే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. సారా వంటకాలు చేసినా, విక్రయించినా శాఖాపర మైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సారా నిర్మూలనకు అందరూ సహకరించాలని కోరారు.

దమయంతి సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని మొగధార అంగన్వాడీ కార్యకర్త షావుకారి దమయంతి గ్రామంలోని పిల్లలకు, గర్భిణులకు అందించిన సేవలు మరువలేనివని సిడిపిఒ పి.రంగలక్ష్మి అన్నారు. దమయంతి ఉద్యోగ విరమణ సందర్భంగా సన్మాన సభ గురువారం నిర్వహించారు. నిరంతరం అంగన్వాడీ కేంద్రానికి వెళ్లి గర్భిణులకు, బాలింతలకు పిల్లలకు అనేక సేవలు అందించారని, వారు చేసిన సేవలు మరువలేనివని అన్నారు. అలాగే తుంబకొండ అంగన్వాడీ కార్యకర్త రత్నాలు ఉద్యోగ విరమణ సందర్భంగా సన్మానించారు. అనంతరం మొగధార అంగన్వాడీ కార్యకర్త దమయంతి భర్త శేఖర్‌ను సిడిపిఒ రంగలక్ష్మి, సూపర్వైజర్ ఈశ్వరి సన్మానించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు, కార్యకర్తలు సతికుమారి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులకు మరమ్మతులు

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని చిన్నమేరంగిలో తాగునీటి పైపుల ద్వారా నీటి సరఫరా సరిగ్గా జరగకపోవడంతో పైపులు మరమ్మత్తులను గురువారం చేపట్టారు. సర్పంచ్ అల్లు రమణమ్మ, పంచాయతీ కార్యదర్శి బి.రామకృష్ణ పర్యవేక్షణలో మరమ్మతులను, ప్రధాన రహదారితో పాటు వీధుల్లో మరమ్మతులు గురైన పైపులను బాగు చేసి నీటి సరఫరాకు అంతరాయం లేకుండా పనులను చేపట్టారు. వేసవిలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా నీటి సరఫరా శుభ్రంగా జరిగేందుకు చర్యలు చేపట్టినట్లు సర్పంచ్ పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

సచివాలయ సందర్శన

పాలకొండ రూరల్ : మండలంలోని వాటపాగు సచివాలయాన్ని ఎంపిడిఒ డొంక త్రినాధులు గురువారం సందర్శించారు. సిబ్బంది హాజరుతో పాటు రికార్డులను పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించి విధులకు హాజరు కావాలన్నారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదు రాకుండా చూడాలన్నారు. అలాగే కొండాపురం వద్ద జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు.

చిరుధాన్యాల సాగుపై అవగాహన

ప్రజాశక్తి - పాచిపెంట

రైతులు చిరుధాన్యాల సాగును పెంచాలని కేంద్ర ప్రభుత్వం 2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించి రైతులకు సరైన మద్ధతు ధరతో చిరుధాన్యాల కొనుగోలుకు శ్రీకారం చుట్టిందని, కావున రాబోయే ఖరీఫ్ సీజన్లో రైతులంతా చిరుధాన్యాల సాగును విస్తరింప చేయాలని ఆత్మ కన్వీనర్, సహాయ వ్యవసాయ సంచాలకులు మధుసూదనరావు అన్నారు. నాందేడువలసలో సర్పంచ్ సోముల లచ్చయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో మహిళలు, యువకులు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తినాలన్నారు. అంతేకాక ప్రజలందరికీ అత్యంత విలువైన పోషకాహారాన్ని అందించే బాధ్యతను గిరిజన రైతులు స్వీకరించాలని, దీనికోసం చిరుధాన్యాల సాగును తప్పనిసరిగా పెంచాలని కొండమూసురు, మిలియ కంచేరు, తుమరావల్లి, నాందేడువలస తదితర గ్రామాల్లో పెద్దలంతా కలిసి గ్రామ వ్యవసాయ సహాయకుల సాయంతో రాబోయే ఖరీఫ్ సీజన్‌కు కావాల్సిన చిరుధాన్యాల విత్తనాల ప్రణాళికను సిద్ధం చేసి పంపించాలని కోరారు. ఈ సందర్భంగా నాందేడువలస సర్పంచ్ సోముల లచ్చయ్య, గుమ్మడిగూడ ఎంపిటిసి డి.లచ్చయ్య మాట్లాడుతూ తప్పనిసరిగా చిరుధాన్యాల సాగుకు తమవంతు ప్రోత్సాహం అందిస్తామని ఆత్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమం ఎంతో ప్రయోజనకరమని తెలిపారు.

జీవామృతంతో జీడి పంటలో అధిక దిగుబడులు

ఎండిపోయిన, వాడిపోయిన కొమ్మలను కొట్టివేసి జీడి తోటలను శుభ్రం చేసుకుని ఎకరాకు 600 లీటర్ల జీవామృతాన్ని పోసుకోవడం ద్వారా జీడి పంటల్లో అధిక దిగుబడి పొందవచ్చుని ఉద్యాన శాఖ అధికారి ఝాన్సీ తెలిపారు. అలాగే టీ దోమ నివారణకు వేప కషాయం, మార్కెట్లో దొరికే వేప నూనె 5 మిల్లీలీటర్లు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. ఎలాంటి ఖర్చు లేకుండా ప్రకృతి సేద్య విధానాల ద్వారా జీడి పంటలో అధిక దిగుబడులు పొందవచ్చున్నారు. అనంతరం వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు ఆధ్వర్యంలో చిరుధాన్యాల సాగు ఆవశ్యకత, నేలతల్లి సంరక్షణ కోసం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విఎఎ అనిల్ కుమార్, ప్రకృతి సేద్య ప్రతినిధులు యశోదమ్మ, తిరుపతినాయుడు, బాలకృష్ణ, నాందేడ్ వలస, మెలికన్నూరు, తుమరవల్లి, గుమ్మడిగూడ గ్రామాల రైతులు పాల్గొన్నారు.